సాక్షి వనపర్తి

ఆదివారం : 16 : ఏప్రిల్ : 2023



దానధర్మాలు.. దయాగుణం

రంజాన్ మాసంలో దానధర్మాలు దీక్షాపరుల్లోని మానవీయ కోణాన్ని తట్టిలేపుతాయి.

వివరాలు 8లో ▸



పేదల జీవితాలు మారలే

ఏ గ్రామానికి వెళ్లినా పేదల బతుకులు ఏమాత్రం మారలేదని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /26.0

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-38 (ఆదివారం సాయంత్రం)

సహర్ 4-36 (సోమవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

పాఠశాలకు బెంచీల వితరణ



కొత్తకోట: మండలంలోని నాటవెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ ఎస్పీ అపూర్వరావు శనివారం బెంచీలు అందజేశారు. ఎస్పీగా విధులు నిర్వర్తించే సమయంలో ఈ పాఠశాలను ఆమె సందర్శించారు. ఆ సమయంలో విద్యార్థులు నేలపై కూర్చోవడం చూసి సొంత ఖర్చుతో బెంచీలు తయారు చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు 40 బెంచీలను ఆమె పాఠశాలకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య, స్థానిక నాయకులు బషీర్, నాగేష్, సాయిబాబు, నబీ, లక్ష్మణ్‌నాయక్, రాజు, బలరాం తదితరులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.2.03 లక్షల ఆర్థిక సాయం అందజేత



వనపర్తిటౌన్: వనపర్తి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తించే వేణుమాధవాచారి గత నెల కొత్తూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతిచెందాడు. మహబూబ్‌నగర్ రీజనల్ మేనేజర్, వనపర్తి డీఎం పరమేశ్వరి, సహాయ మేనేజర్ చంద్రమౌళి సూచన మేరకు కార్మికులంతా కలిసి రూ.2.03 లక్షలు సేకరించారు. శనివారం బాధిత కుటుంబానికి సేకరించిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. తమతో కలిసి విధులు నిర్వర్తించిన వ్యక్తి ఇప్పుడు లేకపోవడం బాధగా ఉందని తోటి కండక్టర్లు, డ్రైవర్లు కన్నీరుమున్నీరయ్యారు. కార్యక్రమంలో డీఆర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, మాజీ ఉద్యోగి ఎం.నీలస్వామి, జేవీ స్వామి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రెండోవిడత గొర్రెలపంపిణీకి ఏర్పాట్లు



ఖిల్లాఘనపురం: ఎలాంటి గొడవలకు తావులేకుండా రెండోవిడత గొర్రెల పంపిణీలో మొదట ప్రతి మండలంలో 6 గ్రామాల లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గొర్రెల కాపరుల సంఘం చైర్మన్ కురుమూర్తియాదవ్ తెలిపారు. శనివారం మండలంలోని అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం తదితర గ్రామాల్లో మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గొల్లకురుమ, యాదవులకు ఇచ్చిన హామీ మేరకు గొర్రెలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కరోనాతో కాస్త ఆలస్యమైనప్పటికీ.. ఈ పథకం కొనసాగుతుందని వివరించారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పశువైద్యాధికారి సహకారంతో లబ్ధిదారులు నేరుగా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు చెల్లించే ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని.. లబ్ధిదారులకు గొర్రెలు అందిస్తామని చెప్పారు. మండల పశువైద్యాధికారి డా. సుసానేకేసి మాట్లాడుతూ.. రెండోవిడతలో మొదట మండలంలోని అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, పర్వతాపురం, ఖిల్లాఘనపురం, మానాజీపేట, రుక్కన్నపల్లి లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల గొల్ల కురుమ యాదవులు ఆస్పత్రి దగ్గరకు వస్తే జాబితాలో పేరు ఉన్నది లేనిది చెబుతామన్నారు. పేరు ఉన్న వారు బ్యాంకు ఖాతాలో రూ.43,750 జమచేసుకోవాలని.. వీరికి రూ.1.75 లక్షల విలువగల 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, సంఘం జిల్లా డైరెక్టర్ బాగన్న, అధ్యక్షుడు వట్టెం నాగయ్య, కొత్తగొల్ల కృష్ణయ్య, సభ్యులు కృష్ణయ్య, విష్ణు యాదవ్, నాగయ్య, శేఖర్, కృష్ణయ్య, శేఖర్, పర్వతాలు పాల్గొన్నారు.

కమీషన్ లొల్లి



- టీ–ప్రైడ్ రాయితీలో ఒకశాతం ఇస్తేనే వివరాల నమోదంటూ డిమాండ్
- అధికారి మాటలను రికార్డు చేసినట్లు ప్రచారం
- బయటపెట్టేందుకు భయపడుతున్న లబ్ధిదారుడు
- కలెక్టర్ చొరవతోనే వెలుగులోకి వచ్చే అవకాశం

వనపర్తి: అన్నివర్గాల వారిని పారిశ్రామికంగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2014లో టీఎస్ ఐ–పాస్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులోని టీ–ప్రైడ్ విభాగంలో ఎస్సీ, ఎస్టీ, శారీరక దివ్యాంగుల జీవన ప్రమాణాలు పెంచేందుకు స్వశక్తితో ఏదేని వాహనం కొనుగోలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పురుషులకు 35 శాతం, మహిళా ఔత్సాహికులకు 45 శాతం.. గరిష్టంగా రూ.75 లక్షల వరకు రాయితీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, రాష్ట్ర కమిటీ సిఫారసు చేసిన దరఖాస్తులకు సంబంధించిన రాయితీని విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ దశలో జిల్లా పరిశ్రమల అధికారులు లబ్ధిదారులు కొనుగోలు చేసిన వాహనాలను పరిశీలించి వాహన వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్ తదితర వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రాయితీ మంజూరైనట్లు తెలుసుకున్న లబ్ధిదారులు జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయానికి వివరాలు ఇచ్చేందుకు వచ్చారు. వచ్చిన రాయితీలో ఒక శాతం కమీషన్ ఇస్తేనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామంటూ అధికారులు డిమాండ్ చేయడం.. కొందరు లబ్ధిదారులు వారి మాటలను రికార్డు చేసినట్లు జిల్లాలో ప్రచారం జోరుగా సాగుతోంది.

రాయితీలో ఒకశాతం ఇస్తేనే..

మంజూరైన రాయితీలో ఒకశాతం కమీషన్ ఇస్తేనే వివరాలు నమోదు చేస్తామని అధికారులు ఆంక్షలు విధించటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఉదాహరణకు రూ.7 లక్షల రాయితీ మంజూరైతే.. రూ.7 వేల కమీషన్, రూ.500 కంప్యూటర్ ఆపరేటర్‌కు అవ్వాలంటూ డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. లబ్ధిదారుల్లో ఒకరు ఆయన మాటలు రికార్డు చేయటంతో విషయం గుప్పుమంది. రికార్డు చేసిన విషయం తెలుసుకున్న సదరు అధికారి ఒక్కసారిగా సీటుపై నుంచి లేచి వెళ్లిపోయారని.. సాయంత్రం అయిదు గంటల సమయంలో ఈ ఘటన జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయంలో చోటు చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది.

మరోమారు జరగనివ్వం..

కార్యాలయంలో ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లాకు మంజూరైన రాయితీని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేశాం.

– యాదగిరి, ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయం

రాయితీ ఇలా..

టీ–ప్రైడ్ విభాగంలో రెండురకాల రాయితీలు మంజూరు చేస్తారు. డీఎల్‌సీ (డిస్ట్రిక్ట్ లేవల్ కమిటీ)లో రూ.10 లక్షలలోపు రాయితీ దరఖాస్తులు, ఎస్‌ఎల్‌సీ(స్టేట్ లేవల్ కమిటీ)లో రూ.10 లక్షలకు మించి రాయితీ దరఖాస్తులపై చర్చిస్తారు. ఆ కమిటీ ఆమోదిస్తేనే వారికి ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుంది. డీఎల్‌సీకి 181 మంది, ఎస్‌ఎల్‌సీకి 74 మందికి రాయితీ మంజూరు చేయాలని ఆయా కమిటీలు ప్రభుత్వానికి సిఫారసు చేశాయి. డీఎల్‌సీలో ఎస్సీ విభాగంలో 92 మంది, ఎస్టీ విభాగంలో 86 మంది, పీహెచ్‌సీ విభాగంలో ముగ్గురు ఉన్నారు. ఎస్‌ఎల్‌సీ విభాగంలో ఎస్సీ విభాగంలో 36 మంది, ఎస్టీ విభాగం, పీహెచ్‌సీ విభాగంలో నలుగురు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నారు. మొత్తం 255 మంది ఔత్సాహికులకు రూ.16.64 కోట్ల రాయితీ మంజూరైంది.

పకడ్బందీగా వరి ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- యాసంగి అంచనా 4 లక్షల మెట్రిక్ టన్నులు
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం విక్రయానికి రావచ్చని.. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 244 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వెల్లడించారు.ఏప్రిల్ మూడో వారం నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని.. అంతకుముందే కోతలు ప్రారంభించిన ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాకు కోటి గన్నీబ్యాగులు అవసరమవుతాయని.. 40 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టార్పాలిన్లు, తూకపు యంత్రాలు, తాగునీరు, రవాణా, మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని.. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎస్‌ఓ సుదర్శన్, డీఎం కొండల్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



వనపర్తి బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్



ఆత్మకూర్ సూపర్ మార్కెట్‌లో కరపత్రాల పంపిణీ

జిల్లా అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్

వనపర్తి క్రైం: ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా నివారించుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్ కోరారు. ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నియంత్రించాలో ప్రయాణికులకు ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది జైపాల్‌రెడ్డి, బాలకొండ పాల్గొన్నారు.

వేసవిలోనే అగ్నిప్రమాదాలు అధికం..

అమరచింత: వేసవిలోనే అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నివారించుకోవాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఆత్మకూర్‌లోని వర్తక సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్, తిప్పడంపల్లి రైల్వేస్టేషన్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు, ప్రయాణికులకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికంగా పశుగ్రాసాలు, గుడిసెలు అగ్నికి ఆహుతవుతాయని.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదం జరిగినప్పుడు తమను తాము ఎలా కాపాడుకోవాలనే విషయంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అగ్నిమాపక సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటనర్సింహ, భానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అయోమయానికి తెర

- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా డా. రవిశంకర్‌ను నియమిస్తూ డీహెచ్ ఉత్తర్వులు
- నిరాశలో పలువురు సీనియర్లు
- మంత్రి సిఫారసుతో తిరిగి బాధ్యతలు



డా. రవిశంకర్

వనపర్తి: జిల్లా వైద్యాధికారి పోస్టుపై నెలరోజులుగా నెలకొన్న అయోమయానికి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా. జి.శ్రీనివాసరావు తెరదించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ 2023, మార్చి 2న డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డా. రవిశంకర్‌ను ప్రభుత్వ మెడికల్ కళాశాల సీఎస్ఆర్‌ఎంఓగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన వెంటనే వైద్య కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి కూడా ఎల్‌పీసీ తీసుకున్నా.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నిర్వహణ దృష్ట్యా అనధికారికంగా డీఎంహెచ్‌ఓగానే విధులు నిర్వహించటం అయోమయానికి తెరతీసింది. ఈ విషయాన్ని ఈ నెల 13న 'సాక్షి' దినపత్రికలో 'అయోమయం' శీర్షికన కథనం ప్రచురించడంతో వెలుగులోకి వచ్చింది. అప్పటి వరకు విషయం తెలియని మంత్రి నిరంజన్‌రెడ్డి వార్తా కథనంపై ఆరా తీశారు. డా. రవిశంకర్, ఏఓ డా. సాయినాథ్‌రెడ్డిని స్థానిక క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని చర్చించారు. వెంటనే రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి మరి కొన్నాళ్లు డా. రవిశంకర్‌నే ఇన్‌చార్జ్‌గా నియమించాలని కోరారు. ఆయన సిఫారసుతో శనివారం డీహెచ్ డా. జి.శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నిరాశలో సీనియర్లు?

డీఎంహెచ్‌ఓ సీటు కోసం జిల్లాలోని పలువురు సీనియర్లు ప్రయత్నాలు చేశారు. చివరకు డా. రవిశంకర్‌నే నియమించడంతో వారి ఆశలు అడియాశలయ్యాయనే చెప్పవచ్చు. మంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సీఏఎస్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్)నే డీఎంహెచ్‌ఓ పదవి వరిస్తుందని భావించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది కొందరు శనివారం ఉదయం కార్యాలయంలో సన్మానాలు చేయటం, పూలమొక్కలు అందిస్తూ ప్రశంసలు గుప్పించటం గమనార్హం.

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి రజని

వనపర్తి క్రైం: లోక్ అదాలత్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామని.. ప్రజలు ఉచిత న్యాయసేవలు పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి రజని తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ ఎయిడ్ క్లినిక్, పారా లీగల్ వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏజీపీ కవిత, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన..

జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి రజని హాజరై మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో సఖి కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. మహిళలను గౌరవించడం, ఆరాధించడంతో సమాజంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు త్రినాథ్, కృష్ణయ్య, ప్రవీణ్, నరేందర్, జయలక్ష్మి, ఉత్తరయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరునికి తైలాభిషేకం



బిజినేపల్లి: శనేశ్వరుడికి భక్తులు తిలాతైలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శనేశ్వరుడి దర్శనం అనంతరం శివుడికి అభిషేకం చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మెరిసిన మీనం





రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తుండటంతో గ్రామాల్లోని మత్స్యకారులకు ఉపాధి లభిస్తోంది. వానాకాలంలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలిన మత్స్యకారులు ప్రస్తుతం చేపలను పట్టి విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. జిల్లాలోని 255 గ్రామాల్లో 130 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో చెరువులు, నీటి కుంటలు మొత్తం 950 ఉండగా.. ఈ ఏడాది 2.26 కోట్ల చేప పిల్లలను ప్రభుత్వం వదిలింది. ప్రస్తుతం చెరువుల్లో ఒక్కో చేప కిలో నుంచి రెండున్నర కిలోల వరకు పెరగడంతో వాటిని పట్టి అమ్మడం, టెండర్‌తో వచ్చిన మొత్తాన్ని సొసైటీ సభ్యులు సమానంగా పంచుకొనేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం అమరచింత పెద్ద చెరువులో జాలర్లు చేపలు పట్టి విక్రయానికి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లారు. – అమరచింత

పులుల అడ్డా.. అమ్రాబాద్

- టైగర్ రిజర్వ్ పరిధిలో 30కి చేరువైన పులుల సంఖ్య
- 78.79 శాతం ఎంఈఈతో ఏటీఆర్‌కు దేశంలోనే 28వ ర్యాంకు



సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్(ఏటీఆర్) పరిధిలో పెద్దపులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తాజాగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య సుమారు 30కి చేరువైనట్లు తెలిసింది. అలాగే దేశంలోని 53 టైగర్ రిజర్వ్‌ల పరిధిలో చేపట్టిన 'మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్‌నెస్ ఎవాల్యుయేషన్(ఎంఈఈ) రిపోర్టు– 2022' ప్రకారం రాష్ట్రంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు మెరుగైన ర్యాంకు లభించింది. ఇందుకు సంబంధించిన ఐదో సైకిల్ సమ్మరీ 2022 రిపోర్టును ఇటీవల ప్రధాని మోదీ విడుదల చేశారు. ఇందులో ఏటీఆర్‌కు 78.79శాతం ఎంఈఈ స్కోరింగ్‌తో దేశవ్యాప్తంగా 28వ ర్యాంకు దక్కింది. టైగర్ రిజర్వ్‌ల పరిస్థితిపై 2018లో నిర్వహించిన మూల్యాంకనంలో ఏటీఆర్ 'గుడ్' రేటింగ్ నుంచి తాజాగా 'వెరీ గుడ్'గా అప్‌గ్రేడ్ అయింది.



అమ్రాబాద్‌లోని బాపన్‌పోడు సెక్షన్ పరిధిలో కెమెరాకు చిక్కిన పెద్దపులి

గతానికి మించి మెరుగైన ఫలితాలు..



ఇటీవల ఎంఈఈ రిపోర్టులో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ర్యాంకు మెరుగుపడింది. టైగర్ రిజర్వ్ నిర్వహణ పరంగా 2018లో ఎవాల్యుయేషన్ గుడ్ నుంచి 2022 నాటికి వెరీ గుడ్ స్థాయికి పెరిగింది. ఏటీఆర్ పరిధిలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

– రోహిత్ గోపిడి, ఐఎఫ్‌ఎస్ అధికారి, డీఎఫ్‌ఓ, నాగర్‌కర్నూల్ జిల్లా

తల్లులైన నాలుగు పులులు..

గతేడాది నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ) చేపట్టిన అధికారిక లెక్కల ప్రకారం అమ్రాబాద్‌లో మొత్తం 21 వరకు పెద్ద పులులు ఉన్నాయి. తర్వాత వీటి సంతతి మరింత పెరిగినట్లు అటవీ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల కాలంలో నాలుగు పులులు మరిన్ని పులి పిల్లలకు జన్మనిచ్చినట్లు సమాచారం. తాజాగా ఎఫ్7 అనే పెద్ద పులి మరో మూడు పులిపిల్లలకు జన్మనివ్వడంతో మొత్తం పులుల సంఖ్య 30కి చేరువైనట్లు తెలుస్తోంది.



మెరుగైన వసతులు..

దేశంలోని టైగర్ రిజర్వ్‌ల పరిధిలో పులుల నివాస సామర్థ్యాన్ని పెంచడం, అందుకు అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవడం, కర్చన ఉద్గా రాలు, కాలుష్య నియంత్రణ, వృక్షజాతులు, నీటి సంరక్షణ, ఫైర్ మేనేజ్‌మెంట్, వన్యప్రాణుల ఆరోగ్యం కోసం మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఎన్టీసీఏ, వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఎంఈఈ మూల్యాంకనాన్ని చేపడుతున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధి మొత్తం 2,611.39 కి.మీ విస్తీర్ణం కాగా, కోర్ ఏరియాపరంగా మొత్తం 2,166.37 కి.మీ విస్తీర్ణంతో దేశంలోనే రెండో అతిపెద్ద టైగర్ రిజర్వ్‌గా నిలిచింది. ఆయా అంశాల్లో 78.79 శాతం ఎంఈఈ స్కోరింగ్‌తో గతానికి మించి ర్యాంకును మెరుగుపర్చుకుంది.

క్లుప్తంగా

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


నిరంజన్ (ఫైల్)

చారకొండ: వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని జూపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ కల్యాణ్‌రావు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంకిల్ల నిరంజన్(50) గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. స్థానికులు గమనించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో విషయాన్ని చారకొండ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. శనివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరంజన్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ధరూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ద్యాగదొడ్డిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు(35) శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఉరి వేసుకుని మృతి చెందాడని, మరికొందరు మద్యం మత్తులో సాధారణ స్థితిలో మృతి చెందినట్లు మరి కొందరు తెలిపారు. మృతికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ కర్నె శేఖర్‌రెడ్డి తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని.. భర్త బలవన్మరణం


ఎల్లప్ప (ఫైల్)

మద్దూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన భర్త అత్తగారి ఊరిలోనే పురుగుమందు తాగి అత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని మోమినాపూర్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కథనం మేరకు.. కొత్తపల్లి మండలం దుప్పడిగట్టుకు చెందిన కావలి ఎల్లప్ప (35)కు మద్దూరు మండలం మోమినాపూర్‌కు చెందిన లక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల నడుమ మనస్పర్థలు రావడంతో భార్య లక్ష్మి కొంతకాలం కిందట పుట్టింటికి వెళ్లింది. పెద్ద మనుషులు సర్దిచెప్పి పంపించినా.. మళ్లీ గొడవపడటంతో తిరిగి పుట్టింటి వెళ్లిపోయింది. శుక్రవారం ఎల్లప్ప భార్యను తీసుకురావడానికి మోమినాపూర్‌కు వెళ్లాడు. ఆమె రాకపోవడంతో వెంట తెచ్చుకున్న పురుగుమందు అక్కడే తాగగా గ్రామస్తులు గుర్తించి వెంటనే మద్దూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అన్న కన్కప్ప ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి బలవన్మరణం

కోస్గి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోస్గి మండలంలో చోటు చేసుకోంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ తగ్గక పోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని కిష్టంపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన ముగ్గని ఆంజనేయులు(34) కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం పొలం దగ్గరకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి మార్గమధ్యలోనే చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే పొలం దగ్గర లేకపోవడం, ఇంటికి కూడా రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా.. చింతచెట్టుకు వేలాడుతున్న విషయాన్ని గమనించారు. వెంటనే కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. కాగా ఆంజనేయులు 5 నెలల క్రితం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే తేరుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై ఆంజనేయులు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

దానధర్మాలు.. దయాగుణం

- రంజాన్ నెలలో ఉట్టిపడే మానవీయ కోణం
- దైవానుగ్రహం కోసం ప్రత్యేక నమాజులు
- జుమాతుల్ విదాకు విశేష ప్రాధాన్యత
- ప్రారంభమైన షబ్-ఎ-ఖదర్ వేడుకలు


మహబూబ్‌నగర్‌లోని జామియా మసీదులో జుమా నమాజ్ చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసం ఉపవాస (రోజాలు) సందర్భంగా దీక్షాపరులు జకాత్, ఫిత్రా పేర్లతో చేస్తున్న ప్రత్యేక దాన, ధర్మాలు దీక్షాపరుల్లోని మానవీయ కోణాన్ని తట్టిలేపుతాయి. నిరుపేదలకు తినుబండారాలు, వస్త్రాల పంపిణీతో పాటు నగదు ఆర్థిక సాయం చేస్తూ ముస్లింలు దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. దాహాగ్ని దహింపజేసే తీవ్రమైన వేసవి అయినా సరే రంజాన్ దీక్షకు మినహాయింపు ఉండదు. దైవానుగ్రహం కోసం రాత్రి పొద్దుపోయే వరకు చేస్తున్న తరావీ, తహజుద్ నమాజులు, ఖురాన్ పఠనంతో (ఇబాదత్‌లు) ముస్లిం కుటుంబాల్లో దైవికం ఉట్టిపడుతోంది. రంజాన్‌లో ఇఫ్తార్ కోసం హిందువులు ప్రత్యేక పండ్లు, ఫలహారాలు పంపడం.. హిందూ కుటుంబాలను పిలిచి ముస్లింలు ఆత్మీయంగా బిర్యానీలు, దూద్ సేమియాలు వడ్డించడంలో ఒక తరగని చెలిమి నెలకొంటుంది.

ప్రతిరోజు ఐదు పూటలు..

ప్రతిరోజు ఐదు పూటలా నమాజు చేసే ముస్లింలు రంజాన్‌లో తరావీ, తహజుద్, సల్వాతుత్తజ్బీ అనే ప్రత్యేక నమాజులు చేస్తారు. తరావీ నమాజులో 20 రకాతులు ఉంటాయి. ఇషా నమాజు అనంతరం రాత్రి 9 గంటల నుంచి గంట లేక గంటన్నర పాటు ఈ నమాజు ఉంటుంది. తహజుద్ నమాజు రాత్రి 3 గంటల నుంచి 4 గంటల్లోగా నాలుగు లేక 8 రకాతులు చేస్తారు. సల్వాతుత్తజ్బీ నమాజు రోజులో ఒక సారిగాని, వారంలో ఒకసారిగాని చదవాలి. ఇందులో మూడో కలిమా 300 సార్లు చదువుతారు. అత్యంత పుణ్యప్రదమైన ఈ నమాజు చాలా దోషాల నుంచి విముక్తి కలిగిస్తుందని ముస్లింల నమ్మకం.

చివరి శుక్రవారం..

రంజాన్‌లోని చివరి శుక్రవారం చదివే నమాజును జుమాతుల్‌విదా అంటారు. ఈ నమాజును వేలాదిమంది ఒకేసారి మసీదులో, మసీదుల బయట చదువుతారు. పవిత్రమైన రంజాన్ నెలలో తాము చేసిన ఉపవాసాలను అంగీకరించమని అల్లాను వేడుకుంటూ రంజాన్‌కు వీడ్కోలు పలికే ఈ నమాజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది. రంజాన్‌లోని మొదటి దశకం (పది రోజులు) క్షమాపణను ప్రసాదిస్తాయి. మూడో దశకం కఠిన శిక్షణ నుంచి విముక్తిని కలిగిస్తాయి.

ప్రారంభమైన వేడుకలు..

రంజాన్‌లో షబ్-ఎ-ఖదర్ (పెద్దరాత్రి) చాలా విశిష్టమైనది. ప్రస్తుతం ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. నెలలోని 21, 23, 25, 27, 29 రోజుల్లోని రాత్రుల్లో అల్లా తన చివరి ప్రవక్త మహ్మద్ (స.అస) ద్వారా పంపిన సందేశాలు ఖురాన్ గ్రంథంగా అవతరించిందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ ఒక్క రాత్రి చేసే నమాజు వల్ల వెయ్యి నెలల రాత్రుల నమాజు చేసే పుణ్యం సొంతమవుతుందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

దువాకు ప్రాధాన్యత..



వెయ్యి మాసాల రాత్రులతో సమానంగా రంజాన్‌లో వచ్చే లైలతుల్ ఖద్ర్. రంజాన్ నెల చివరి రోజుల్లోని లైలతుల్ ఐదు రాత్రుల్లో ఏదో ఒక రాత్రి లైలతుల్‌ఖద్ర్ రావచ్చు. కాబట్టి ఈ ఐదు రాత్రుల్లో అల్లాను ఒప్పించేలా ప్రతి నిత్యం ఇబాదత్, జికర్, తస్బీ, దురుదే షరీఫ్, అస్తగ్‌ఫార్ లాంటి పఠిస్తూ ఉండాలి. ఆ రోజు రాత్రి దువా చేస్తే దైవదూతలు ఆమీన్ అంటారు. లైలతుల్ ఖద్ర్‌న దువా చేసే వారి పాపాలను అల్లాతాలా మన్నిస్తారు.

– మౌలానా ఖాజా ఫైజొద్దీన్, మహబూబ్‌నగర్

వీటిలో రంజాన్ నెల 27వ తేదీని అతి ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా 'షబ్-ఎ-ఖదర్' జాగరణ పాటిస్తారు. వెయ్యి సాధారణ రాత్రుల కంటే ప్రధానమైందని ఖురాన్‌లో ప్రవచించినందున ముస్లింలు ఈ రాత్రి జాగరణ చేసి క్షమాభిక్ష కోరుతూ ఇంటిల్లిపాదీ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.


జిల్లాకేంద్రంలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

సమభావం పెంపు..

రంజాన్ మాసంలో మసీదుల్లో దీక్షాపరులు నిర్వహించే సామూహిక ఇఫ్తార్లు ముస్లిం సంప్రదాయానికి ప్రతీక. ఇఫ్తార్లకు ఇస్లాంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. సామూహిక ఇఫ్తార్లతో మనుషుల మధ్య అనుబంధాలు పెరుగుతాయని మహ్మద్ ప్రవక్త (స.అ.స) పవిత్ర హదీసుల్లో పేర్కొన్నారు. పేద, ధనిక తేడాలు తొలగిపోతాయి. హిందువులు ఇఫ్తారు ఏర్పాటు చేసి ముస్లింలను ఆహ్వానిస్తున్నారు. ఇఫ్తార్ సోదర భావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

నగల కోసం.. మహిళ దారుణ హత్య?


సింప్లి (ఫైల్)

కల్వకుర్తి రూరల్: నగల కోసం మహిళను దారుణంగా హతమార్చిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రమేష్‌యాదవ్ కథనం ప్రకారం.. మండలంలోని ఎల్లికల్‌తండాకు చెందిన సింప్లి(45) ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు 13న మహిళ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే శనివారం సాయంత్రం మండలంలోని రామగిరి సమీపంలో కుళ్లిన శవం ఉందనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లి విచారణ చేయగా మృతదేహం సింప్లిది అని గుర్తించారు. సింప్లికి కల్లు తాగే అలవాటు ఉందని, ఈ క్రమంలోనే కల్లు దుకాణంలో కొందరు ఆమెతో మాటలు కలిపి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి నగలు తీసుకుని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని ఎస్ఐ రమేష్‌యాదవ్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- క్రూజర్ వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం


బోల్తాపడిన క్రూజర్ వాహనం

మక్తల్: తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్న వారి క్రూజర్ వాహనాన్ని డీసీఎం ఢీకొట్టింది. కానీ దాదాపు 18మందికి తృటిలో పెద్దప్రమాదం తప్పింది. శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. జక్లేర్, రామసముద్రం గ్రామాలకు చెందిన యువకులు తీర్థయాత్రలకు వెళ్లారు. శనివారం తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. రామసముద్రంలో కొందరిని దింపి, జక్లేర్ బయలుదేరారు. జక్లేర్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా మహబూబ్‌నగర్ నుంచి మక్తల్ వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో క్రూజర్ బోల్తాపడింది. అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే అద్దాలు పగులగొట్టి లోపల ఉన్న వారిని బయటికి తీశారు. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి.

డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం


మల్లేష్ (ఫైల్)

కందనూలు: డీసీఎం ఢీకొని వ్యకి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నాగర్‌కర్నూల్‌లోని ఆర్టీసీ డిపో దగ్గర చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. తెలకపల్లికి చెందిన మల్లేష్ (35) బిజినేపల్లి మండలం పాలెంలోని ప్రభుత్వ వసతి గృహంలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం విధులు ముగించుకున్న తర్వాత తన బైక్‌పై తెలకపల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పాతబ్రిడ్జి దగ్గర కొల్లాపూర్ నుంచి వస్తున్న డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టడంతో మల్లేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి...

వలిగొండ: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన నాగన్న (48) కుటుంబంతో సహా కొంత కాలం క్రితం వలిగొండ మండలానికి వచ్చి గోల్నేపల్లి స్టేజి సమీపంలో గల ఇటుకబట్టీలలో పనిచేస్తున్నాడు. కాగా, నాగన్న శనివారం రాత్రి ఇటుకబట్టీ నుంచి గొల్నేపల్లి గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్తుండగా స్టేజి సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఓ బైక్ ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో నాగన్న కిందపడగా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

కాలిపోయిన మొక్కజొన్న పంట


కాలిపోయిన మొక్కజొన్న కంకుల వద్ద బాధిత రైతు ప్రసాద్‌రావు

అయిజ: కోసి పొలంలో కుప్పగా ఉంచిన మొక్కజొన్న పంట కాలిపోయింది. ఈ సంఘటన మండలంలోని కుటుకనూరులో శనివారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు ప్రసాద్‌రావు తన పొలంలో మొక్కజొన్న పంట కంకులు కోసి ఒకచోట రాశిగా ఉంచాడు. శనివారం తెల్లవారు జామున వీచిన గాలులకు విద్యుత్ స్తంభాల వైర్లు ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు మొక్క జొన్న రాశిపై రాలాయి. దీంతో మంటలు చెలరేగి సుమారు 25 క్వింటాళ్ల మొక్కజొన్న కంకులు కాలిపోయాయి. చుట్టుపక్కల పొలాల వద్ద నిద్రిస్తున్న రైతులు గమనించి మంటలు ఆర్పారు. తనను ఆదుకోవాలని ఈ సందర్భంగా బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు ఈతవనానికి నిప్పు

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఈత వనానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుందని గ్రామస్తులు తెలిపారు. స్థానికులు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.



అక్రమ కలప సేకరణపై కేసు నమోదు


టేకు కలపతో ఎఫ్ఆర్ఓ ప్రభాకర్

మన్ననూర్: అటవీ పరిసర ప్రాంతం నుంచి అక్రమంగా సేకరించిన కలపను కనుగొని కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. శనివారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో సిబ్బందితో కలిసి గ్రామ పరిసర ప్రాంతంలో సోదాలు నిర్వహించగా కొన్ని టేకు, సిరివెను దుంగలను (కలప) కనుగొన్నట్లు తెలిపారు. దుంగలను అదే గ్రామంలోని యాదయ్య, పరమేష్ ఇంటి వద్ద భద్రపరిచి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

మిడ్జిల్: మండలంలోని రాణిపేట చెరువు నుంచి శుక్రవారం రాత్రి అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి ఆదేశానుసారం ఆర్ఐ రామాంజనేయులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాల్టా చట్టం ప్రకారం మట్టి లోడ్‌తో ఉన్న టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామని ఎస్ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. రెండు టిప్పర్లలో మట్టి ఉండగా.. రెండు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- ఆరుగురిపై కేసు నమోదు

వనపర్తి క్రైం: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఇర్ఫానాబేగాన్ని అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన భర్త, అత్తతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వనపర్తికి చెందిన ఇర్ఫానాభేగంకు హైదరాబాద్‌లోని కార్వాన్‌కు చెందిన మసూద్ షరీఫ్‌తో 2019లో వివాహం జరిగింది. రూ.లక్ష నగదు, 4 తులాల బంగారం, వంట సామగ్రి కట్నంగా ఇచ్చారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ కొన్ని నెలలుగా భర్త మసూద్ షరీఫ్, అత్త నజుమా షరీఫ్, అడపడుచు నౌసీన్ బేగం, మరిది మహ్మద్ షరీఫ్, తోటి కోడలు షమీమ్, మేనకోడలు అనీస్ బేగం వేధింపులకు గురి చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా ఎంపీపీగా సుదర్శన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దుతు బాగా పెరిగిందని అన్నారు. బీఆర్ఎస్ మొదటి బీఫాం నూతనంగా ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌కు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉండాలని కోరారు. పార్టీలో పని చేసేవారికి తప్పకుండా గుర్తింపు వస్తుందని, ప్రజల్లో ఉండాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీ శశిరేఖ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మిడ్జిల్ ఎంపీపీగా సుదర్శన్


సుదర్శన్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి మురళీధర్‌గౌడ్

మిడ్జిల్: మండల పరిషత్ అధ్యక్షుడిగా బరిగెల సుదర్శన్ శనివారం ఏకగ్రీవంగా నియామకమయ్యారు. ఎంపీపీ ఎన్నికకు గత సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం ఉదయం 11గంటలకు ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించగా, బీఆర్ఎస్ నుంచి సుదర్శన్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళిధర్‌గౌడ్ ప్రకటించారు. అనంతరం నియామకపత్రం అందజేశారు. మండలంలో మొత్తం 9ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఎంపీపీ పదవి ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. అప్పట్లో కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 4, స్వతంత్ర అభ్యర్థి ఒక్కరు గెలుపొందడంతో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కాంతమ్మ ఎంపీపీగా ఎన్నికయ్యారు. గత జనవరి 30న తన పదవికి రాజీనామా చేయడంతో, ఎంపీపీ సీటు ఖాళీగా ఉన్నది. ఫిబ్రవరిలో ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు నోటిఫికేష్ విడుదల చేయగా, బీఆర్ఎస్ బీఫాం అందుబాటులో లేని కారణంగా ఎన్నిక వాయిదా వేశారు. తిరిగి శనివారం ఎన్నిక నిర్వహించగా, వాడ్యాల్ ఎంపీటీసీ సుదర్శన్ బీఆర్ఎస్ నుంచి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శశిరేఖ, మండల అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు బాల్‌రెడ్డి, బాలు, జంగారెడ్డి, శివప్రసాద్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మైనర్లు అదృశ్యం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం, బండ్రపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. బండ్రపల్లికి చెందిన కోట్ల నిర్మల, తిరుపతయ్య దంపతుల కూతురు శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్లు, బాలిక స్నేహితుల దగ్గర వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. అలాగే అమ్మాపురం గ్రామానికి చెందిన మంగమ్మ, రాజు దంపతుల కూతురు శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ బాలిక ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతుంది. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు.

120 కిలోల నల్లబెల్లం స్వాధీనం



అచ్చంపేట రూరల్: కారులో నల్లబెల్లం, పటికను అక్రమంగా తరలిస్తుండగా వలపన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. మండలంలోని బొల్గట్‌పల్లి పంచాయతీ డొక్కుతండా వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం ఉండటంతో వచ్చిన కారును ఆపి పరిశీలించగా.. 120 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటిక ఉండటంతో కారులో ఉన్న శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అచ్చంపేట తహసీల్దార్ కృష్ణయ్య ఎదుట బైండోవర్ చేశారు. తనిఖీల్లో ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది ప్రకాష్, ఆసిఫ్, స్వాతి పాల్గొన్నారు.

పేట కలెక్టర్‌పై డీఓపీటీకి వీహెచ్‌పీ ఫిర్యాదు

నారాయణపేట: స్థానిక జిల్లా కలెక్టర్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ మంత్రి జితేంద్రసింగ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండాను అవమానపర్చిన ప్రభుత్వ ఉద్యోగిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వీహెచ్‌పీ నాయకులతో కలెక్టర్ అమర్యాదగా మాట్లాడిన తీరును తప్పుబడుతూ డీఓపీటీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జనవరి 26న మరికల్ మండలం పల్లెగడ్డలో డా. అంబేద్కర్ చిత్రపటానికి పూజ, జాతీయజెండా ఆవిష్కరణలో అంగన్‌వాడీ టీచర్ ఎస్తేర్ ప్రవర్తన భారతజాతి వ్యతిరేకతకు నిదర్శనంగా ఉందని.. ఈ విషయాన్ని తెలియజేసేందుకు జనవరి 27న కలెక్టరేట్‌కు వెళ్లామని.. కలెక్టర్ అమర్యాదగా మాట్లాడిన విషయంపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రామోజీరావు ఓ విషసర్పం

చంద్రబాబు కరపత్రం.. ఈనాడు

- అక్రమాలకు వజ్రాయుధం.. ఈ పత్రిక
- మార్గదర్శిలో రూ.వేల కోట్ల డిపాజిట్లు మళ్లించిన మాట వాస్తవమే..
- డిపాజిటర్ల భవిష్యత్తు కోసం ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ చేయడం మంచి పని
- ఎన్టీఆర్‌ని చాలా వేధించారు.
- చంద్రబాబు ఏడ్వడానికి.. రామోజీ మంచంపై పడుకోవడానికి కారణం అదే
- చేసిన పాపాలు తిరిగి తగులుతాయని రామోజీ, బాబును చూస్తే తెలుస్తోంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీరావు తోడల్లుడు, డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: రామోజీరావు ఓ విషసర్పమని ఆయన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈనాడును అడ్డుపెట్టుకుని రాయలసీమ, ఉత్తరాంధ్రలపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా అమరావతిలో కొన్ని భూముల కోసం విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక చంద్రబాబు కరపత్రికగా మారిపోయిందన్నారు. గతంలో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినట్టే ఇప్పుడు సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల గుండెల్లో కొలువైన వైఎస్ జగన్‌ను కూడా గద్దె దించాలని కుట్రలు చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో సీఐడీ అధికారులు ఏ–1గా ఉన్న రామోజీరావును, ఏ–2గా శైలజా కిరణ్‌ను విచారిస్తున్న నేపథ్యంలో సంస్థలో లోపాలు, నిధుల మళ్లింపులను మార్గదర్శిలో చాలా కీలకంగా వ్యవహరించిన రామోజీరావు తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు వివరించారు. ఈ మేరకు 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఈగో ఫీలింగ్‌తో ఈనాడు ప్రారంభమైంది..

ఒకసారి కేఎల్ఎన్ ప్రసాద్‌తో రామోజీరావు మాట్లాడుతున్న సమయంలో మాటామాటా పెరిగింది. పేపర్ ప్రారంభించడమంటే సులభం కాదన్న మాటలతో రామోజీలో ఈగో ఫీలింగ్ తలెత్తింది. ఎందుకు సులభం కాదో చూద్దామని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారు. 1974 ఆగస్టు 10న ఫౌండర్ ఎండీగా నేను వ్యవహరిస్తూ ఈనాడు ప్రారంభించాం. నంబర్‌వన్ పేపర్‌గా వచ్చేంత వరకూ నేను కృషి చేశాను.

రామోజీ దీన్ని ఓర్వలేకపోయారు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చిన్నగా ప్రారంభమైంది. ఆ తర్వాత రామోజీకి బ్రాంచ్‌లు విస్తరించాలన్న ఆలోచన వచ్చింది. విజయవాడ వచ్చినప్పుడు నన్ను పిలిచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ విస్తరిస్తామని చెప్పారు. విజయవాడలో మొదటి బ్రాంచ్ ఏర్పాటు పనుల్ని రెండు మూడు నెలల్లోనే ప్రారంభించాం. ఆ తర్వాత విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు సహా 8 బ్రాంచ్‌లను వెంటనే మొదలుపెట్టాం. క్రమంగా చిట్స్ పెరిగాయి. అప్పట్లో ఆ నగదును ఎటూ మళ్లించకపోవడంతో మార్గదర్శి బాగానే ఉంది. ఇంతలో ఈనాడు క్రమంగా విస్తరించి నంబర్‌వన్‌గా మారింది. ఆ తర్వాత డాల్ఫిన్ హోటల్‌పై దృష్టిసారించాం. ఆ బాధ్యతలు కూడా నేనే తీసుకొని.. అద్భుతంగా తీర్చిదిద్దాను. ఈనాడు, డాల్ఫిన్.. ఇలా అన్నింటిని లీజుకు తీసుకున్న స్థలాల్లోనే నడిపాం. అందుకే మాకు లీజు మాస్టర్లు అని పేరొచ్చింది. నన్ను చూసే ఆ స్థల యజమానులు లీజులకు ఇచ్చారు. దీన్ని కూడా రామోజీ ఓర్వలేకపోయారు. నేను ఎదిగిపోతానేమోనన్న భయం రామోజీని వెంటాడింది.

అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు..

ఒక స్థాయి వరకూ డిపాజిట్లు తీసుకునేంత వరకూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాగానే ఉంది. ఈ డిపాజిట్లను మొదట ఈనాడు, డాల్ఫిన్ విస్తరణకు తరలించాం. ఎక్కడా ఇబ్బంది కలగకుండా.. లాభాలు రాగానే తిరిగి మళ్లీ మార్గదర్శిలోకి మళ్లించేవాళ్లం. అయితే.. సుప్రీంకోర్టు నిబంధనలను కఠినతరం చేసింది. ఆ సమయంలో ఒక సుప్రీంకోర్టు జడ్జి అభిప్రాయాల్ని తీసుకున్నాం. దాని లూప్‌హోల్‌ని పసిగట్టిన రామోజీరావు మార్గదర్శి డిపాజిట్లను మళ్లించడం మళ్లీ మొదలు పెట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) హెచ్చరించడంతో నిధుల మళ్లింపును నిలుపుదల చేశారు. అయితే అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు. ఈనాడు అప్పటికే అగ్రస్థానానికి చేరుకోవడంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారు. ఆ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ దీనిపై పోరాటం మొదలుపెట్టారు.

వైఎస్సార్ చొరవతో కొంతమందికి చెల్లింపు

2,600 మంది కష్టమర్ల సొమ్మును వెంటనే కట్టాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పటికప్పుడు సొమ్ములు తిరిగి వెనక్కు తీసుకురాలేని తరుణంలో వివిధ అంతర్జాతీయ కంపెనీలతో రామోజీరావు చర్చలు జరిపారు. అయితే అంత పెద్దమొత్తం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రామోజీ.. చంద్రబాబుని సంప్రదించారు. ఆయన రిలయన్స్‌ని, నిమేష్ అంబానీ అనే బ్రోకర్‌ని పట్టుకున్నారు. రామోజీ సంస్థల షేర్లు ఒక్కోటి రూ.500గా ఉంటే రూ.5 వేలుగా చూపించి నిధులు తెచ్చారు. తద్వారా 2,600 మంది కష్టమర్లలో కొంతమందికి చెల్లించారు. అయితే ఎంతమందికి ఇచ్చామనే వివరాల్ని ఇప్పటికీ రామోజీ బయటపెట్టలేదు. పైగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని వాదిస్తుంటారు. అంత పెద్ద వ్యక్తిపైన ఫిర్యాదు చేస్తే.. తమ భవిష్యత్తు ఏమవుతుందనే భయంతోనే డిపాజిటర్లు వెనకడుగు వేశారు. అది కూడా ఆ రోజుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అప్రమత్తమవ్వడంతోనే కొంతమందికి చెల్లించారు.

లెక్కలన్నీ పక్కాగా ఉంటే భయమెందుకు?

వచ్చిన చిట్స్ మొత్తాన్ని రామోజీ ఇష్టం వచ్చినట్లు మళ్లించేస్తుంటే.. భవిష్యత్తులో ఏ చిన్న పొరపాటు జరిగినా లక్షల మందికి ఎలా చెల్లించగలరు? ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనాల్సిన అవసరం ఉంది. మార్గదర్శి డిపాజిటర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ ప్రారంభించడం చాలా మంచిపని. లెక్కలన్నీ పక్కాగా ఉన్నప్పుడు రికార్డులు ఇవ్వడానికి భయమెందుకు?

మూడో వ్యక్తికి తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు..

మార్గదర్శిలో మేనేజర్లు అకౌంట్స్ చేయడం, రిజిస్టర్స్ నిర్వహించడం మొదలైనవన్నీ చేయాల్సి ఉంటుంది. కానీ.. వారందర్నీ రామోజీ డమ్మీలుగా చేసేశారు. ఏ బ్రాంచ్‌లో డబ్బులు వచ్చినా ప్రధాన కార్యాలయానికి పంపించాలనే హుకుం జారీ చేశారు. వివిధ జిల్లాల్లో వసూలైన చిట్స్ డబ్బులు మొత్తం ప్రధాన కార్యాలయంలోనే ఉంటాయి. ఏ జిల్లాలో ఎన్ని డిఫాల్టులు ఉన్నాయి.. ఎంత మొత్తం వస్తుంది.. అనేది ఎవరికీ తెలీదు. ఇందులో ఏం జరుగుతుందనేది మూడో వ్యక్తికి కూడా తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు.

రామోజీ భయపడ్డారు..

మార్గదర్శిపై సీఐడీ దాడులతో రామోజీ భయపడ్డారు. అందుకే మంచం పట్టినట్లు కనిపించారు. దాని వల్ల ఎక్కువగా ప్రశ్నించరని అనుకున్నారు. కానీ.. అది వర్కవుట్ కాలేదు. ఆ ఫొటో (మంచంపై పడుకున్న రామోజీని సీఐడీ విచారిస్తున్న) చూశాక నాకే ఆశ్చర్యమనిపించింది. ఆ స్థితిని చూసినప్పుడు ఈ మధ్య చంద్రబాబు ఏడ్చిన విషయం గుర్తొచ్చింది. గతంలో ఆరోగ్యం కూడా బాగోలేని ఎన్టీఆర్‌ని చంద్రబాబు, రామోజీ కలిసి ఏడిపించారు. చాలా మానసిక వేదనకు గురిచేశారు. రామోజీ మంచంపై పడుకోవడానికి.. చంద్రబాబు ఏడవడానికి కారణం కూడా అదే. చేసిన పాపాలు మనకు తిరిగి తగులుతాయని వీళ్లని చూస్తే తెలుస్తుంది. సుమన్ ఉండి ఉంటే.. మార్గదర్శికి సంబంధించి అప్పుడే గొడవలు జరిగి ఉండేవేమో. ఎందుకంటే సుమన్‌కి ఈ తరహా మోసాలు అసలు నచ్చవు.

అక్రమాలకు వజ్రాయుధంగా ఈనాడు..

అన్యాయాలు జరిగినప్పుడు, అక్రమాలు జరిగినప్పుడు ఈనాడుని ఉపయోగిస్తే చాలా బాగుంటుంది. గతంలో అలానే ఉపయోగపడింది. కానీ.. రానురానూ ఈనాడుని స్వార్థానికి ఉపయోగించడం మొదలుపెట్టారు. ఇప్పటికే అదే పంథాని కొనసాగిస్తున్నారు. తమ అక్రమాలకు పత్రికని వజ్రాయుధంగా మార్చుకున్నారు. ఎన్టీఆర్ రాజకీయంలో అడుగులు వేస్తున్న సమయంలో.. ఈనాడు ఎంతో ఉపయోగపడింది. ఎన్టీఆర్ అసెంబ్లీ టికెట్లు ఇచ్చే విషయంలో ఈనాడు రిపోర్టర్ల ద్వారా అభ్యర్థుల పేర్లని ఎంపిక చేసి నేనే ఉత్తరాంధ్ర నుంచి 37 పేర్లు పంపించాను. దాన్నే ఎన్టీఆర్ పరిగణనలోకి తీసుకోవడం.. వారంతా విజయం సాధించడంతో నాపై ఆయనకు నమ్మకం కలిగింది. ఆ సమయంలో నాకు ఎంపీ టికెట్ ఇవ్వాలని భావించారు. ఆ పేర్ల జాబితాని రామోజీరావుకు ఎన్టీఆర్ వినిపించడంతో.. రామోజీ నన్ను ఫోన్ చేసి అడిగారు. నాకు తెలీదని చెప్పాను. ఎక్కడ రాజకీయాల్లో ఎదిగిపోతానో అనే భయంతో రాజకీయాల్లోకి వద్దని అడ్డుకున్నారు.

టీడీపీకి కరపత్రంగా ఈనాడు మారిపోయింది

ప్రస్తుతం మార్గదర్శిలో జరిగిన అవకతవకలు బయటపడతాయన్న విషయాన్ని రామోజీ గ్రహించారు. వాటిని ప్రజల్లోకి వెళ్లకూడదని భావించారు. అందుకే... టీడీపీ నేతలు, తెలిసినవారితో పత్రికపై దాడి చేస్తున్నారంటూ మాట్లాడిస్తున్నారు. డిపాజిట్లు అంటే ఏమిటో, చిట్స్ అంటే ఏమిటో తెలియనివారు కూడా మీడియా ముందుకు వచ్చి ఈనాడుపై దాడి, మార్గదర్శిపై దాడి అని మాట్లాడుతున్నారు. ఈనాడు తెలుగుదేశం పార్టీకి కరపత్రంగా ఉంది. కాబట్టి.. వారు దీన్ని కప్పిపుచ్చాలని భావిస్తున్నారు. సుప్రీంకోర్టులో ఏం జరుగుతుందనేది చూడాలి. ఇది కరెక్టో, కాదో.. డిపాజిటర్లని విచారించాలి. ప్రతివాదుల్ని పిలవకుండా.. గతంలో కేసు కొట్టించేశారు. ఇప్పుడు మళ్లీ పోరాటం జరుగుతోంది. న్యాయం ఆలస్యమవ్వొచ్చు కానీ.. ధర్మం ఎప్పటికైనా గెలుస్తుంది. ఇప్పుడు మార్గదర్శికి ఈ పరిస్థితి వచ్చిందంటే దానికి రామోజీరావే ప్రధాన కారణం.

రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది..

ఇదంతా.. తన సామ్రాజ్యం.. ఇందులో వేరెవరికీ చోటుండకూడదని రామోజీరావు ఎప్పుడూ భావిస్తుంటారు. దీనికి చంద్రబాబు సహకారం అందించారు. ఎన్టీఆర్‌ని పదవీచ్యుతుడిని చేశాక ఇద్దరూ ఒక్కటైపోయారు. అప్పటి నుంచి రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది. ఫిల్మ్‌సిటీని 1,000 నాగళ్లతో దున్నించేస్తానని కేసీఆర్ చెప్పడంతో.. ఆయనను మభ్యపెట్టేందుకు కేసీఆర్‌తో చర్చలు జరిపారు. ఓం సిటీ కడతానని ప్లాన్లు చూపించారు. ఇది ఫిల్మ్‌సిటీని మించిపోతుందని నమ్మించారు. దాన్ని మోదీకి కూడా చూపించారు. కానీ.. ఓం సిటీ ఏమైంది..? పేపర్లకే పరిమితమైంది.

రామోజీ.. కీలక 'లేఖ'పై కిమ్మనరెందుకు?

వివేకా హత్య కేసులో అసలు నిజాలు ఎందుకు రాయరు?

- అప్పుడే దానిని పోలీసులకు ఎందుకు ఇవ్వలేదని ఎప్పుడైనా రాశారా?
- తామొచ్చే వరకు దాచి పెట్టండని వివేకా అల్లుడు, అతని అన్న ఎందుకు చెప్పారు?
- కీలకమైన ఈ విషయంపై దర్యాప్తు సాగడం లేదని ఎందుకు చెప్పరు?
- వివేకా చనిపోయారని అందరికీ చెప్పింది వివేకా అల్లుడు, అతని అన్న కాదా?
- ఈ విషయాలన్నీ వదిలి దర్యాప్తును పక్కదోవ పట్టించేలా మీ రాతలేంటి?
- ఎవరిని తప్పించాలని.. ఎవరిని ఇరికించాలని ఈ రాతలు?

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా ఈనాడు రామోజీ కంకణం కట్టుకున్నారు. ఘటనా స్థలంలో దొరికిన అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న లేఖ, సెల్‌ఫోన్‌ను వెంటనే ఎందుకు పోలీసులకు స్వాధీనం చేయలేదనే అంశాన్ని ఏనాడైనా రాశారా రామోజీ? ఈ కేసులో తొలి నుంచీ ప్రతి విషయంలో మీ వక్రీకరణ కనిపిస్తూనే ఉంది. ఎప్పుడు ఏ చిన్న విషయం తెలిసినా.. దానిని ప్రభుత్వానికి, ఎంపీ అవినాశ్‌రెడ్డికీ ముడిపెట్టి లేనిపోని విషయాలు కలిపి చెలరేగిపోతూ వండివార్చడమే మీరు పనిగా పెట్టుకోవడం నిజం కాదా? అసలు వివేకా కేసులో ఇంత గందరగోళానికి కారణం ఏమిటని ఏనాడైనా తొంగి చూశారా? వైఎస్ వివేకానందరెడ్డిపై తీవ్రంగా దాడి చేసిన ఆగంతకులు ఆయనతో బలవంతంగా ఓ లేఖ రాయించారు. తనను డ్రైవర్ ప్రసాద్ తీవ్రంగా గాయ పరచినట్టుగా ఆ లేఖలో వివేకా రాసినట్టుగా ఉంది. ఆ లేఖ ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ రోజే అంటే 2019 మార్చి 15న ఉదయమే గుర్తించారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని మొదటగా చూసింది ఆయనే. ఆ లేఖతో పాటు వివేకానందరెడ్డి సెల్‌ఫోన్‌ను కూడా ఆయన స్వాధీనం చేసుకున్నారు. వివేకానందరెడ్డి మరణించిన సమాచారాన్ని ఆయన భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్‌రెడ్డిలకు ఫోన్ చేసి చెప్పారు. వివేకానందరెడ్డి మృతదేహం ఫొటోలను కూడా వాట్సాప్ చేశారు. ఆ ఫొటోలు చూస్తే ఎవరికైనా అది హత్య అని సులువుగా తెలుస్తుంది. ఆ లేఖను తాము వచ్చే వరకు ఎవరికీ ఇవ్వొద్దని.. ఆ విషయం బయటకు చెప్పొద్దని వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. దాంతో ఆ లేఖ విషయం ఆయన పోలీసులకుగానీ ఇతరులకుగానీ చెప్పనే లేదు. అనంతరం వివేకానందరెడ్డి పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెప్పడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డికి విషయం తెలిసింది. దాంతో ఎన్నికల ప్రచారానికని బయలు దేరిన ఆయన వెనుదిరిగి వివేకా నివాసానికి చేరుకున్నారు. అప్పుడు కూడా వివేకానందరెడ్డి రాసిన లేఖ విషయాన్ని పీఏ కృష్ణారెడ్డి ఎవరికీ చెప్పనే లేదు. ఆ లేఖ విషయం అప్పుడే చెప్పి ఉంటే వివేకానందరెడ్డిది హత్య అని వెంటనే తెలిసేది. ఈ విషయం కదా తొలుత తేలాల్సింది. అది తేలితే తర్వాత కథ వేరుగా ఉండేది. ఈ విషయాలపై దర్యాప్తు సాగాలని ఏనాడైనా ఈనాడు రాసిందా? అంటే మీ ఉద్దేశం అసలు దోషులను తప్పించి.. ఇంకెవరినో ఇరికించాలనేగా! ఆ దిశగా దర్యాప్తు సాగేలా.. దర్యాప్తు సంస్థను ప్రభావితం చేసేలా తప్పుడు కథనాలు వండివార్చుతున్నది అందుకేగదా..

ఇది మీకు కనిపించలేదా?

సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డి ఆ రోజు అంటే 2019 మార్చి 15న మధ్యాహ్నం 12 – ఒంటి గంట మధ్య పులివెందులకు చేరుకున్నారు. అప్పుడు పీఏ కృష్ణారెడ్డి ఆ లేఖను వారికి అందించారు. వారు దానిని సాయంత్రం 5 గంటల వరకు వారి వద్దే ఉంచుకున్నారు. ఆ తర్వాత తిరిగి వాటిని కృష్ణారెడ్డి ద్వారా పోలీసులకు అందించారు. ఆ సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లు, ఇతర డాటాను డిలీట్ చేసి మరీ పోలీసులకు ఇచ్చినట్టు సమాచారం. సహజంగా ఆ లేఖ విషయాన్ని వెంటనే చెప్పకుండా గోప్యంగా ఉంచిన పీఏ కృష్ణారెడ్డిని తొలుత ఎందుకు ప్రశ్నించలేదని, ఎవరి ఆదేశాల మేరకు ఆ లేఖ విషయాన్ని రహస్యంగా ఉంచారో ఎందుకు తెలుసుకోలేదని.. అందువల్లే ఈ కేసులో కీలకమైన చిక్కుముడి విడిపోవడం లేదని ఎందుకు మీ రాతల్లో కనిపించదు రామోజీ? విషయం అందరికీ తెలిశాక.. ఘటనా స్థలానికి చేరుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని.. వారిని దోషులుగా చూపుతూ దుష్ప్రచారం చేయడం మీకే చెల్లింది. వివేకా హత్య జరిగిన రోజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి అవినాశ్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లానని ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆ రోజూ చెప్పారు. ఈ రోజూ అదే చెబుతున్నారు. ఓ పని కోసం ఎంపీ ఇంటికి వెళ్లానని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శశికళ కూడా ఆరోజు, ఈ రోజు అదే చెబుతోంది. ఎంపీ ఇంటి వద్ద ఉన్నామని వాళ్లే స్వయంగా చెబుతున్నప్పుడు.. ఆ విషయం కొత్తగా కనిపెట్టినట్లు మీరు చెప్పడం ఏమిటో!

ఉదయ్‌ను పోలీస్ కస్టడీకి ఇవ్వండి

వివేకా హత్య కేసులో అరెస్టయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ సీబీఐ కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిగే అవకాశం ఉంది.

యురేనియం తవ్వకాలను అడ్డుకుందాం



అమ్రాబాద్: నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని నల్లమల యురేనియం తవ్వకాల వ్యతిరేక జేఏసీ చైర్మన్ నాసరయ్య అన్నారు. శనివారం అమ్రాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ దిష్టిబొమ్మను జేఏసీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ రాజ్యసభలో యురేనియం నిక్షేపాలను వెలికితీస్తేనే తెలంగాణ, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారని అన్నారు. ఆయన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ, పట్టించుకోకపోవడం తగదని అన్నారు. ప్రజలు తవ్వకాలకు వ్యతిరేకంగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, ఎల్లస్వామి, నిరంజన్, మునువర్ అలీ ఉన్నారు.

920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వార 920 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

పేదల బతుకులు మారలే

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



శివనంపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్/ ఎర్రవల్లిచౌరస్తా: ఏ గ్రామానికి వెళ్లినా పేదల బతుకులు ఏమాత్రం మారలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర శనివారం ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి, పెద్దదిన్నె గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల పేరుతో ప్రజల ఓట్లను దండుకొని ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజలను, వారి సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో బీసీలు, ఎస్సీలు, ముస్లింలు అభివృద్ధికి ఆమడదూరంలో మగ్గుతున్నారన్నారు. ఎక్కడ చూసినా నిరుపేద కుటుంబాలు సమస్యలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని, రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంటలను విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. బంగారు తెలంగాణలో ఎన్నో కుటుంబాలు పూరి గుడిసెల్లో జీవిస్తున్నారని, ఎక్కడ చూసినా నిరుద్యోగుల సమస్య తాండవిస్తుందని, ఎంతోమంది చిన్నారులు చదువుకు దూరంగా ఉంటూ వెట్టిచాకిరితో మగ్గుతున్నాయని దుయ్యబట్టారు. ఆయా సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బహుజన రాజ్యంలో విద్య, ఉద్యోగాలు, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని కోరారు.

మత సామరస్యం కలిగిన పార్టీ బీఎస్పీ

దేశంలో మత సామరస్యం కలిగిన పార్టీ బీఎస్పీ మాత్రమేనని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అలంపూర్‌లో ముస్లింలకు శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు, పార్టీల కారణంగా దేశం మతోన్మాదంలోకి పోయే ప్రమాదం ఉందని, దాన్ని ముందుగానే కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పూర్తిస్థాయిలో రాజ్యాంగ విలువలు పాటిస్తూ, మత స్వేచ్ఛను కాపాడే పార్టీ కేవలం బీఎస్పీ మాత్రమేనని, బీఎస్పీలో హిందు, ముస్లింలు, క్రిష్టియన్లు అనే తారతమ్యం లేకుండా సమానత్వం అనే సిద్ధాంతాన్ని పాటిస్తున్నామని చెప్పారు. తాను పుట్టిన అలంపూర్ గడ్డ మీద మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అలంపూర్ ప్రజలు బీఎస్పీకి బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఉపాధ్యక్షుడు మణికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ, రాంబాబు, తిరుపాల్, ఉపేందర్, రవిచందర్, కనకంబాబు, మధుగౌడ్, నాగరాజు, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

నేడు పుస్తక ఆవిష్కరణ సభ

పాలమూరు: ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకోట రవీంద్రనాథ్ రచించిన 'నే తిరిగిన నేల' పుస్తకాన్ని ఆదివారం షాద్‌నగర్‌లో ఆవిష్కరిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పాలమూరు అధ్యయన వేదిక ప్రచురిస్తున్న పుస్తకాలలో ఇది 51వ ప్రచురణ అని పేర్కొన్నారు. షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ హాల్‌లో నిర్వహించే ఆవిష్కరణ సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రముఖ కవి, రచయిత ఉదయమిత్ర హాజరవుతారని, ఉమ్మడి జిల్లాలో ఉన్న కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మన్యంకొండలో వైభవంగా తిరుచ్చిసేవ





తిరుచ్చి సేవ నిర్వహిస్తున్న పురోహితులు, అలంకరణలో స్వామి దంపతులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వా దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంలో స్వామి దంపతుల ఉత్సవమూ ర్తులను ఉంచి గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యా లు, పురోహితుల వేదమంత్రాల మధ్య మంటపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అక్క డ ప్రత్యేక పూజలు నిర్వహించి.. తిరిగి పల్లకిలో గర్భగుడి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చన చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానంద చారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి

మన్ననూర్: ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించిన అమ్రాబాద్ అభయారణ్యంలోని అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం మన్ననూర్‌లోని ఈఈసీ సెంటర్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజా సమక్షంలో ఎన్‌జీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ పరిసర ప్రాంత గ్రామాల్లోని యువతకు స్వయం ఉపాధితో పాటు ఆరోగ్యం, అందరికీ విద్య పరమైన సహకారం, వన్యప్రాణులు, అడవుల పరిరక్షణకు సహకరించే విధంగాచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ టంపల్ మాట్లాడుతూ 'స్కూల్ బయోడైవర్సిటీ రిజిస్టర్ ప్రోగ్రాం' ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2019లో విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ, కోనేరు, అపోలో, హెల్త్, హైటికాన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, టాటా గ్రూప్, జేసీఐకి సంబంధించిన ఎన్‌జీఓలతో పాటు, ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్ఆర్ఓలు ఉన్నారు.

సెల్‌టవర్ ఎక్కి యువతి హల్‌చల్



సెల్‌టవర్‌పై యువతి

మదనాపురం: ప్రేమించిన యువకుడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని.. తనకు న్యాయం చేయాలంటూ ఓ యువతి శనివారం మధ్యాహ్నం రామన్‌పాడు సమీపంలోని ఎర్రగట్టు వద్ద ఉన్న సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మదనాపురం మండలం తిరుమలాయపల్లికి చెందిన కృష్ణవేణి రామన్‌పాడుకు చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. అతడు పెళ్లికి నిరాకరించడంతో 2017లో పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. అప్పట్లో ఆ యువకుడు జైలుకు కూడా వెళ్లిరాగా.. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. ప్రేమించిన యువకుడు మరో పెళ్లి చేసుకున్నాడని తెలియడంతో వారం రోజులుగా ఇంటిదగ్గర తల్లిదండ్రులతో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తూ శనివారం సెల్‌టవర్ ఎక్కింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నరేందర్, ఎస్ఐ మంజునాథరెడ్డి, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని కిందకు రావాలని కోరారు. తనకు న్యాయం జరిగే వరకు కిందికి దిగేది లేదని మూడు గంటల పాటు అక్కడే కూర్చొంది. కొత్తకోటకు చెందిన సెల్‌టవర్ కార్మికులను రప్పించి వారి సాయంతో కిందికి దింపి నీరసంగా ఉండటంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు.

గ్రామసింహాల పరుగు పందెం పోటీలు



పోటీ పడుతున్న గ్రామసింహాలు

గట్టు: దిగంబరస్వామి ఉత్సవాల సందర్భంగా మండలంలోని బల్గెరలో శనివారం గ్రామసింహాల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. పోటీల్లో తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 శునకాలు పాల్గొన్నాయి. కర్ణాటకలోని సిద్ధి రాంపురం గ్రామానికి చెందిన రాజు శునకం మొదటి బహుమతి సాధించగా రూ.15,016, ద్వితీయ స్థానంలో బల్గెరకు చెందిన లక్ష్మణ్ శునకం నిలవగా రూ.10,016, కర్ణాటక మలబావికి చెందిన తిమ్మప్ప శునకం తృతీయస్థానంలో నిలవగా రూ.5,016 నగదు బహుమతి అందజేశారు. విజేతలకు జెడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హనుమంతు, గ్రామస్తులు కిష్టప్ప, బజారి, రాజు, బుగ్గన్న, ఈరన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు పరిశీలించిన కేంద్ర బృందం



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గోపాల్‌పేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రెండోరోజు జాతీయ నాణ్యతా ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్) అధికారులు శిల్పామన్‌చండ, అంకూర్ సూడెన్ పరిశీలించారు. కేంద్రంలోని వివిధ విభాగాలు రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులను చూసి పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరుపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డా. మంజుల, ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.